సాక్షి ప్రకాశం

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



బెడిసికొట్టిన భూకబ్జా ప్లాన్

సింగరాయకొండ మండలం కనుమళ్లలో హైవే పక్కన రూ.కోటికిపైగా విలువైన భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు స్కెచ్ వేశారు. - 8లో..



బాలికలపై లైంగిక దాడి

కొత్తపట్నం మండలానికి చెందిన ఇద్దరు బాలికపై అదే గ్రామానికి చెందిన పెద్దనాన్న వరసయ్యే వ్యక్తి లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడి

ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చూస్తుంటే అందరికీ భయం వేస్తోంది. పోలీసు రాజ్యం మినహా ప్రజా రాజ్యం నడుస్తున్నట్లు కనిపించడం లేదు. సాక్షి ఎడిటర్‌తోపాటు మరి కొందరిపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేసి విచారణ చేయడం చాలా విడ్డూరంగా ఉంది. ఎల్లో మీడియా తమ అవసరం కోసం ప్రభుత్వ లోపాలు ఎత్తి చూపుతూ వార్తలు రాస్తే కేవలం రిజాయిండర్ లేదా వివరణ మాత్రమే అడుగుతున్నారు. చంద్రబాబు పర్యవేక్షణలోని సూర్యఘర్‌పై వారు వార్తలు రాస్తే ఖండన మాత్రమే ఇచ్చారు. సాక్షి పత్రిక అమరావతికి సంబంధించి ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తను మాత్రమే రాస్తే ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వటాన్ని చూస్తుంటే పత్రికా స్వేచ్ఛను హరించాలనే తాపత్రయమే కనిపిస్తోంది. ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడి చేస్తున్నారు. – **మేరుగు నాగార్జున**, మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్





చంద్రబాబు రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాడు

రాష్ట్రంలో చంద్రబాబు తన నాయకత్వంలో ఒక నియంత లాగా ఆటవికపాలన సాగిస్తున్నాడు. ఇందుకు నిదర్శనమే సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై బనాయించిన అక్రమ కేసులు. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ కాలరాస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ సిగ్గుతో తలదించుకునేలా కూటమి పాలన సాగుతోంది. ఇది ముమ్మాటికి రెడ్‌బుక్ రాజ్యాంగం. రాష్ట్రంలో త్వరలో నేపాల్, శ్రీలంక తరహాలో ప్రజలు తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పడదోసే రోజులు రానున్నాయి. అన్ని వర్గాల ప్రజలు రోడ్డెక్కారు. కేవలం ఎల్లోమీడియా పత్రికలు, ఛానళ్ల ద్వారా ప్రజలను మభ్యపెట్టడం ఎంతో కాలం సాగదు.

– **డాక్టర్ ఆదిమూలపు సురేష్**, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి



న్యూస్‌రీల్

కలెక్టర్‌గా రాజాబాబు

- గుంటూరు బదిలీ అయిన తమీమ్ అన్సారియా



ఒంగోలు సబర్బన్: జిల్లా కలెక్టర్‌గా పి.రాజాబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఏ.తమీమ్ అన్సారియాను గుంటూరుకు బదిలీ చేశారు. 2013 బ్యాచ్ ఐఏఎస్ అయిన రాజాబాబు ప్రస్తుతం ఏపీపీఎస్‌సీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: ఒంగోలు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

ఒంగోలు: ఈనెల 13న ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు వర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయ స్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కేసుల పరిష్కారం కోసం 25 బెంచీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాలో 9 వేల కేసులు పరిష్కారానికి అర్హమైనవిగా ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారపు చెల్లింపు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకుని తమ వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల్లో తీర్పు అంతిమ తీర్పు అని, కోర్టుల్లో చెల్లించిన ఫీజును తిరిగి పొందవచ్చన్నారు. ప్రీసిట్టింగ్ రూపంలో ఇరువర్గాల ఆమోదంతో ముందస్తుగా వ్యాజ్యాలు పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంబంధిత న్యాయవాదులు, మీడియేషన్ న్యాయవాదులు సహకరిస్తారన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు.

అవినీతి ర్యాంకులు!

జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అవినీతి జబ్బు చేసింది. పైసా లేనిదే ఫైళ్లు కదలడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏఎన్ఎం పదోన్నతుల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడం తెలిసిందే. జిల్లా సెలక్షన్ కమిటీ పరీక్షల్లో వచ్చిన ర్యాంకులను రాత్రికి రాత్రే మార్చేసి పదోన్నతులు చేసినట్లు కొందరు ఏఎన్ఎంలు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిబ్బందికి సెలవు కావాలన్నా సరే బల్లకింద చేతులు తడపకుండా పనికావట్లేదన్న ఆరోపణలు రావడం గమనార్హం.



- గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు
- ఇప్పటికే పలు మార్లు విచారణ వాయిదా
- మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య ఫిర్యాదు
- అక్రమాలపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో జేడీ విచారణ
- శుక్రవారం కొనసాగనున్న విచారణ
- జీజీహెచ్‌లో నర్సింగ్ డ్యూటీల విషయంలో చేతివాటం
- వైద్యారోగ్య శాఖలో పెచ్చుమీరిపోతున్న అవినీతి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా వైద్యారోగ్య శాఖలో 826 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఉన్నారు. వారిలో 215 మందికి గ్రేడ్-2 ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించారు. 2024 ఫిబ్రవరిలో సినియార్టీ లిస్ట్ ప్రకటించారు. తెరవెనుక ఏం జరిగిందో కానీ అదే ఏడాది ఆగస్టులో సీనియారిటీ లిస్టులో మార్పులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. జిల్లా సెలక్షన్ కమిటీకి ఎలాంటి సమాచారం లేకుండానే సీనియారిటీ లిస్టు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ తరువాత ఏడాది దాటాక 2025 మార్చి 17వ తేదీన జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అయితే జిల్లా సెలక్షన్ కమిటీ ఇచ్చిన ర్యాంకుల ప్రకారం పదోన్నతులు చేపట్టాల్సిన అధికారులు దానికి భిన్నంగా ర్యాంకుల్లో మార్పులు, చేర్పులు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ర్యాంకులు మారడంతో ఏడుగురు ఏఎన్ఎంలు పదోన్నతులు కోల్పోయారు. ఇందులో ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే అధికారులు వారి దృష్టికి తీసుకొని రావాల్సి ఉంటుంది. కానీ అలాంటి ప్రయత్నాలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

ఆ నలుగురు ఎవరు...

ఇదిలా ఉండగా పదోన్నతుల వ్యవహారంలో భారీ మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని ఓ నలుగురు పదోన్నతుల అక్రమాలకు తెర దీసినట్లు ప్రచారం జరిగింది. లిస్టులో ర్యాంకుల మాయ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే 250 ర్యాంకు వచ్చిన వారికి సీనియారిటీ లిస్టులో 142వ ర్యాంకు, 288వ ర్యాంకు వచ్చిన వారికి సీనియారిటీ లిస్టులో 162వ ర్యాంకు ఇచ్చారు. గతంలో మండ్లమూరు మండలంలోని పులిపాడు సచివాలయంలో విధులు నిర్వహించిన గ్రేడ్-3 ఏఎన్ఎంకు డీఎస్సీ ర్యాంకుల్లో 206వ ర్యాంకు కేటాయించారు. పదోన్నతుల దగ్గరకు వచ్చే సరికి ర్యాంకు 213కు చేరుకుంది. ఇదేలా సాధ్యమో అర్థం కాక ఆమె తలపట్టుకున్నారు. ఒకసారి ర్యాంకు ఇచ్చిన తరువాత మధ్యలో ర్యాంకు మారడం పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలా 3517 ర్యాంకు వచ్చిన ఏఎన్ఎంకు సీనియారిటీ లిస్టులో 845వ ర్యాంకు రావడంతో పలువురు ఏఎన్ఎంలు విస్మయానికి గురయ్యారు. నష్టపోయామని భావించిన ఏఎన్ఎంలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



జేడీ విచారణకు హాజరైన బాధిత ఏఎన్ఎంలు

వాయిదాల మీద వాయిదా...

బాధిత ఏఎన్ఎంలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. అప్పటి డీసీఎం మాధురిని విచారణాధికారిగా నియమించారు. అయితే ఇక్కడ కూడా ఏదో జరిగిందన్న పుకార్లు షికార్లు చేశాయి. ఎందుకోకానీ డీసీఎం మాధురి విచారణ సక్రమంగా జరగలేదు. ఒకసారి మాత్రమే విచారణకు హాజరయ్యారు. ఆ తరువాత విచారణ వాయిదాల మీద వాయిదా పడుతూ వచ్చింది. డీసీఎం మాధురి మీద ఒత్తిడి వచ్చిందని వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు గుసగుసలాడుకున్నారు. ఈ లోపు మాలమహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. తర్వాత జాయింట్ డైరక్టర్ సునీల్ నాయక్‌ను విచారణాధికారిగా నియమించారు. గురువారం జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో సునీల్ నాయక్ విచారణ చేపట్టారు. ర్యాంకింగ్ మార్పుతో పదోన్నతులు కోల్పోయిన ఏఎన్ఎంలు, ఫిర్యాదుదారులు విచారణాధికారిని కలిసి వాదన వినిపించారు. శుక్రవారం కూడా ఆయన విచారణ జరపనున్నట్లు సమాచారం.

జేడీ విచారణలోనైనా అక్రమాలు బయటపడతాయా లేదా అని వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అసలు ఉద్యోగుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన ఆ నలుగురు ఎవరు, వారి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా నర్సుల డ్యూటీల విషయంలోనూ చేతివాటం చూపిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై అధికారులు విచారణ చేసినట్టు తెలిసింది.

ఫోన్ పే ద్వారా డబ్బు వసూలు...

పదోన్నతులు, కోరిన చోటికి బదిలీలు చేయడానికి ఆ నలుగురు పైసా వసూళ్లకు తెగబడ్డారని ఆరోపణలు వచ్చాయి. నేరుగా డబ్బులు వసూలు చేస్తే ఏమవుతుందోనని కొత్త తరహాలో లంచాల వసూళ్లకు తెరదీసినట్లు ప్రచారం జరిగింది. తన కుటుంబ సభ్యులు, మిత్రుల ఫోన్ల నంబర్లు ఇచ్చి వారి పేరు మీద ఫోన్ పే చేయించుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని మరో గ్రూపు సమాచారాన్ని లీక్ చేయడంతో అక్రమాల గుట్టు రట్టయింది. ఏఎన్ఎంలు కూడా తమ వద్ద ఫోన్ పే చేయించుకున్నారని చెప్పడంతో వైద్య శాఖలో సంచలనం సృష్టించింది. దీంతో కథ కలెక్టర్ వద్దకు చేరింది.

14న జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

ఒంగోలు: జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈనెల 14న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుంది. 75 కేజీలలోపు బరువున్న బాలురు, 65 కేజీల లోపు బరువున్న బాలికలు, 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఎంపికైన క్రీడా జట్లు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలో జరిగే 51వ రాష్ట్ర స్థాయి బాల బాలికల పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిసాయి. వివరాల కోసం సెల్: 9948343232 ని సంప్రదించవచ్చు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థినిని లైంగికంగా వేధించాడన్న ఆరోపణపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీ మహేంద్ర గురువారం తెలిపారు. డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

బడి తరలించడంపై నిరసన



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

బేస్తవారిపేట: ఎస్సీ కాలనీలోని బడిని రద్దు చేసి దూరంగా ఉన్న మోడల్ స్కూల్‌లో విలీనం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేసిన ఘటన బేస్తవారిపేటలో గురువారం జరిగింది. మండలంలోని ఖాజీపురం ఎస్సీ కాలనీలో 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాల నిర్వహించేవారు. ప్రభుత్వం 3, 4, 5 తరగతులను రద్దు చేసి ఎస్సీ కాలనీకి దూరంగా ఉన్న మోడల్ స్కూల్‌లో విలీనం చేశారు. దాదాపు 40 ఏళ్లుగా ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాలను తీసేయడంతో పిల్లలను దూరంగా ఉన్న బడికి పంపాల్సి రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలోనే 1 నుంచి 5 తరగతులు పెట్టాలని డిమాండ్ చేశారు.

పేదల ఆరోగ్యాన్ని పణంగా పెడతారా?

- మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం తగదు
- ప్రైవేటుకు అప్పగిస్తే పేదలను జలగల్లా పీల్చిపిప్పి చేయడం ఖాయం
- ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. వైద్యశాలలను ప్రైవేటుకు అప్పగిస్తే పేదలను జలగల్లా పీల్చిపిప్పి చేస్తారని, పేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా మారిపోతుందని స్పష్టం చేశారు. గురువారం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనకబడిన ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రజలకు వైద్య వసతులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురంలో వైద్య కళాశాలను మంజూరు చేశారని చెప్పారు. జగనన్న హయాంలో వచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో ఒంగోలులో రిమ్స్ పేరుతో ఆస్పత్రి నిర్మించారని, ఈ రోజు రిమ్స్‌లో పేద ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. జగనన్న పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో మంజూరు చేసిన వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే పేదలు ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2,360 మెడికల్ సీట్లు ఉన్నాయని జగనన్న తెచ్చిన మెడికల్ కాలేజీల్లో కొత్తగా 2550 మెడికల్ సీట్లు పేద పిల్లలు చదువుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఇప్పుడు కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేదల సీట్లు పెద్దలకు వెళ్లిపోతాయని చెప్పారు. వైద్య విద్య కోసం ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలతో పాటుగా చైనా, రష్యాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా తీసేసి బీమా పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.300 కోట్ల చొప్పున ఏడాదికి రూ.3600 కోట్లు ఖర్చవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.4500 కోట్ల బకాయిలుంటే కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ఆరోగ్యశ్రీ డబ్బులే ఇవ్వలేని చంద్రబాబు రేపు బీమా కంపెనీలకు కట్టాల్సిన డబ్బులను చెల్లించకపోతే పరిస్థితి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు సీఎం అయ్యాక సుమారు రూ.2 లక్షల అప్పు తీసుకొచ్చారని, అమరావతి పేరుతో రూ.70 వేల కోట్లతో టెండర్లు పిలిచారని చెప్పారు. ఇందులోంచి కేవలం రూ.6 వేల కోట్లు ఖర్చు పెడితే రాష్ట్రంలోని వైద్య కళాశాలలను పూర్తి చేయవచ్చని, పేదలకు ఉపయోగపడుతుందని చెప్పారు.

ప్రకాశం జిల్లా అంటే ఎందుకంత చిన్నచూపు:

ప్రకాశం జిల్లా అంటే చంద్రబాబుకు ఎందుకంత చిన్నచూపని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ప్రశ్నించారు. వెనకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లాకు దివంగత సీఎం రాజశేఖర రెడ్డి పుణ్యమా అని వెలిగొండ ప్రాజెక్టు వచ్చిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో మెడికల్ కాలేజీ వచ్చిందని చెప్పారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీని కూడా ఎందుకు తీసుకొని రాలేకపోయారని ప్రశ్నించారు. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం ఫౌండేషన్ వరకు మాత్రమే వేశారని కూటమి పాలకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రైవేటు పరం చేయడం పశ్చిమ ప్రజలను ద్రోహం చేసినట్లేనని వ్యాఖ్యానించారు. మార్కాపురంలో ఎవరికైనా అనారోగ్యం వస్తే వందల కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. అదే మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటే ఎంతో మంది ప్రజల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. పీపీపీ వలన వైద్యం ఎక్కడకూ పోదని కథలు చెబుతున్నారని, ప్రభుత్వం చేతిలో ఉన్నప్పుడే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వమే నేరుగా మార్కాపురం వైద్య కళాశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, జిల్లా పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణా రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రా రెడ్డి, సీనియర్ నాయకులు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

స్థలాలు కొట్టేస్తూ.. అభివృద్ధి ముసుగేస్తూ!

- శ్రీకృష్ణ యాదవ భవనం స్థలం రద్దు
- దశరాజుపల్లి రోడ్డులోని ఖబరస్థాన్ స్థలంపై కన్ను
- అభివృద్ధి పేరుతో ట్రంకు రోడ్డు వ్యాపారులపై పెత్తనం
- బండ్లమిట్టలో అక్రమ నిర్మాణాల జోలికెళ్లని కార్పొరేషన్ అధికారులు
- నేడు ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



ఖబరస్థాన్ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు నగరవాసులు నయవంచనకు గురవుతున్నారు. ఒకవైపు అభివృద్ధి పేరుతో మాయాజాలం చేస్తుండగా, మరోవైపు వర్గాల వారీగా ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మాటలకు అధికారులు తందానా అంటున్నారు. శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశం వేదికగా పలు ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. నగరంలోని ట్రంక్ రోడ్డు విస్తరణకు సంబంధించి గత కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ గట్టిగా వ్యాపారుల పక్షాన నిలిచింది. అలాగే ట్రంక్ రోడ్డు బాధితులు, వ్యాపారులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దాంతో రీహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ బెనిఫిట్స్ కింద బాధితులను నగదు రూపంలో ఆదుకోవాలని నగరపాలక సంస్థకు హైకోర్టు సూచించింది. 73 మంది బాధితులను నగదు రూపంలో ఆదుకోవాలని ఉత్తర్వులిచ్చింది. ట్రంకు రోడ్డులో వ్యాపారులు అన్ని రకాల అనుమతులు తీసుకుని ఒంగోలు నగరపాలక సంస్థకు అన్నిరకాల పన్నులు చెల్లిస్తూ వస్తున్నారు. అదేవిధంగా ఇన్‌కం ట్యాక్సు, జీఎస్‌టీ, ఇతర అన్ని ప్రభుత్వ విభాగాలకు చెల్లించాల్సిన పన్నులు చెల్లిస్తున్నారు. టీడీఎస్ బాండ్లు ఇస్తాము.. రూ.కోట్ల విలువ చేసే స్థలాలు రోడ్డు విస్తరణకు ఇవ్వండని మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారు. అందుకే కోర్టు మెట్లెక్కి బాధితులు ఆర్డర్ తీసుకొచ్చారు.

వారికో న్యాయం.. వీరికో న్యాయమా..?

ట్రంకు రోడ్డు విస్తరణలో ప్రాపర్టీ కోల్పోయే వారంతా కూడా ప్లాన్ అప్రూవల్ కోసం మున్సిపల్ శాఖకు పన్నులు, లేబర్ సెస్ వగైరా చెల్లించారు. అలాగే ప్రాపర్టీ, కొళాయి పన్ను చెల్లిస్తున్నారు. వీళ్లకే నోటీసులిచ్చి మరీ కూలగొట్టేందుకు నగర పాలక సంస్థ అధికారులు మార్కింగ్ కూడా ఇచ్చారు. ఒక్క రూపాయి కూడా ప్లాన్ చార్జీగానీ, లేబర్ సెస్‌గానీ చెల్లించకుండా బండ్లమిట్ట – అద్దంకి బస్టాండ్ రోడ్డులో భారీ కాంప్లెక్స్‌లు నిర్మించుకుని రూ.లక్షల్లో అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. వారి వైపు కార్పొరేషన్ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ, బినామీ పట్టాలతో భారీ కాంప్లెక్స్‌లు నిర్మించుకుని రూ.లక్షల్లో అద్దెలు తీసుకుంటుండగా.. నేటికీ ఇంకొన్ని నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ముందువైపు కాకుండా రోడ్డుకు వెనుక ఊరచెరువు వైపు చూస్తే ఒక్కొక్క బిల్డింగ్ లోతు 250 నుంచి 300 అడుగులు సొరంగాల మాదిరిగా ఉన్నాయి. బండ్లమిట్ట-అద్దంకి బస్టాండ్ (ట్రావెలర్స్ బంగళా రోడ్) 100 అడుగుల రోడ్డు కాస్తా 40 అడుగుల వరకు అక్రమ నిర్మాణాలతో కుంచించుకుపోయింది. మరి అధికారులు వాటిజోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

యాదవ భవన స్థలం రద్దు దుర్మార్గం...

శ్రీకృష్ణ కళ్యాణ మండపం, యాదవ భవనానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 19వ డివిజన్‌లో స్థలం కేటాయించారు. దాన్ని కూటమి ప్రభుత్వ పెద్దలు రద్దు చేశారు. ఆ స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆ విషయం తెలుసుకుని ఆలిండియా యాదవ మహా సభ నాయకులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లను కలిస్తే యాదవ భవన్, కళ్యాణ మండపానికి ఆ స్థలం ఇచ్చిన విషయం తెలియదని చెప్పుకొచ్చారు. చివరకు యాదవ భవన్‌కు ఇచ్చిన స్థలాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆర్డర్ కూడా జారీ చేసింది. గతేడాది ఏప్రిల్ 24వ తేదీ కౌన్సిల్ ఆమోదం పొందిన స్థలాన్ని ఏ విధంగా రద్దు చేస్తారని యాదవ మహాసభ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముస్లిం శ్మశానవాటిక పరిస్థితీ అంతే...

ఒంగోలు నగరంలో ముస్లిం శ్మశాన వాటిక విషయంలో కూడా కూటమి ప్రజాప్రతినిధులు కుట్రలకు తెర తీశారు. కమ్మపాలెం దాటిన తర్వాత దశరాజుపల్లి రోడ్డులో గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2 ఎకరాల 40 సెంట్ల భూమిని ముస్లిం శ్మశాన వాటికకు కేటాయించింది. కమ్మపాలేనికి ఆనుకుని ఉందని ఆ సామాజిక వర్గం ప్రజలకు, ఆయన అనుయాయులకు ఆ స్థలాన్ని కట్టబెట్టాలని కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ స్థలాన్ని రద్దు చేసి ముక్తినూతలపాడు సర్వే నంబర్ 15లో 3 ఎకరాల భూమి కేటాయిస్తున్నామని దాటవేత ధోరణితో కాలయాపన చేస్తూ ముందుకుపోతున్నారు. ఆ స్థలం పూర్తిగా కుంట పోరంబోకు కావడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఎన్టీఆర్ కళాక్షేత్రానికి అడ్డగోలుగా రూ.10 లక్షలు

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ఆర్టీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎన్టీఆర్ కళాక్షేత్రానికి ప్రజల సొమ్ము అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో కళాక్షేత్రాన్ని టెండర్ ద్వారా ఒకరికి కేటాయించారు. అతనికి అప్పజెప్పిన నగర పాలక సంస్థ తిరిగి కళాక్షేత్రం పునరుద్ధరణ పనుల పేరిట రూ.10 లక్షలకు టెండర్ పిలిచింది. కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పుడు పునరుద్ధరణ పనుల ప్రస్తావనే లేదు. అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్ పొందిన వ్యక్తి గతంలో కళాక్షేత్రాన్ని లీజుకు తీసుకుని రూ.25 లక్షలు ఒంగోలు నగర పాలక సంస్థకు పంగనామం కూడా పెట్టాడు.

పత్రికలపై కేసులు తగదు



ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న పత్రికలపై కేసులు నమోదు చేయడం మంచి సంప్రదాయం కాదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న 'సాక్షి'పై ఇటీవల కాలంలో వరుసగా కేసులు నమోదు చేశారు. ఇలా పత్రికల గొంతు నొక్కే విధానాలు మానుకోవాలి. నచ్చని అంశాలు ఉంటే ఖండన ఇవ్వడమో.. లేదా న్యాయపరంగా ఎదుర్కోవడమో చేయాలి కానీ అక్రమ కేసులు బనాయిస్తే ఎలా. – భూపని కాశయ్య, సీనియర్ న్యాయవాది, మార్కాపురం



పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సమాచార వ్యవస్థలో కీలకమైన వార్తా పత్రికలపై పాలకులు అక్రమంగా పోలీసు కేసులు నమోదు చేయడం తగదు. వార్తల్లో అంశాలు తప్పు అని భావిస్తే ప్రకటన ద్వారా ఖండన పంపవచ్చు. వాస్తవాలు ప్రచురిస్తే అవి నచ్చకపోతే అక్రమ కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. ప్రభుత్వం పోలీసులు సంయమనంతో వ్యవహరించాలి. – ఓవి మల్లిక్, సీనియర్ జర్నలిస్టు, యజ్ఞోపవీతం ఎడిటర్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకులకు బెయిల్ మంజూరు

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి, వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో టీడీపీ కార్యకర్త ఈదర ప్రవీణ్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. మహిళల ఎదుట దుస్తులు విప్పి అసభ్యకరంగా ప్రవర్తించిన ఈదర ప్రవీణ్‌ను స్థానికులు చితకబాదారు. ఈ విషయంలో నమోదైన అక్రమ కేసులో నిందితులుగా పేర్కొన్న వైఎస్సార్ సీపీ నాయకులు సింగమనేని బ్రహ్మయ్య, ఈదర అమర్నాథ్ చౌదరి, మల్లవరపు కోటిరెడ్డి, వల్లంరెడ్డి రమణారెడ్డితోపాటు మరొకరికి సింగరాయకొండ కోర్టు ఈ నెల 9న 14 రోజుల రిమాండ్ విధించింది. వైఎస్సార్ సీపీ నాయకుల బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం ఆమోదించగా గురువారం జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. వీరిని వైఎస్సార్ సీపీ టంగుటూరు మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరిరావు, పలువురు నాయకులు జిల్లా జైలు వద్ద పరామర్శించారు.

విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

● ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: ఫ్లెక్సీలు, ప్లకార్డుల రూపంలో విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలను ఫ్లెక్సీలు, ప్లకార్డుల రూపంలో ప్రదర్శిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఫ్లెక్సీల్లో కుల, మత, సామాజిక వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా ఎటువంటి కామెంట్స్ ఉండరాదని, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, ఇతరుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు వాడితే నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి ఫ్లెక్సీలను డిజైన్ చేసినా, ప్రింట్ చేసినా చట్టపరంగా బాధ్యత వహించాల్సి వస్తుందని, దుకాణాలను సీజ్ చేస్తామని ప్రింటర్లను హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల కార్యకర్తలు, యువత, సంఘాలు సహకరించాలని కోరారు.

పొదిలిలో నకిలీ విలేకర్ల హల్‌చల్!

● పోలీసుల అదుపులో ఒకరు..
● ఉడాయించిన మరో ఇద్దరు

పొదిలి: విలేకర్ల ముసుగులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఓ ఆర్ఎంపీని దబాయించి, బెదిరింపులకు దిగిన సంఘటన గురువారం పొదిలిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పొదిలి పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ప్రైవేట్ ప్రథమ చికిత్స కేంద్రం ఉంది. గురువారం అక్కడికి ముగ్గురు వ్యక్తులు వచ్చి నిర్వాహకుడిని సర్టిఫికెట్లు ఉన్నాయా అని ప్రశ్నించారు. అసలు నీ అర్హత ఏమిటి, నీకు వైద్యం వచ్చా అంటూ హడావుడి చేశారు. మీరెవరంటూ ఆర్ఎంపీ ఎదురు ప్రశ్నించడంతో తాము విజయవాడకు చెందిన చానల్ విలేకర్లమమని చెప్పారు. 'మేము అడిగేదానికి సమాధానం చెబుతావా లేక మా చానల్‌లో నీ గురించి చెప్పమంటావా' అంటూ బెదిరిస్తున్న తరుణంలో స్థానికులు అక్కడ పోగయ్యారు. దీంతో పరిస్థితి అర్థం చేసుకున్న ఇద్దరు వ్యక్తులు అక్కడ నుంచి ఉడాయించారు. స్థానికులు ఒకరిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయమై ఎస్సై వేమనను వివరణ కోరగా 'విచారణ చేస్తున్నాం. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామ'ని చెప్పారు.

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

కొత్తపట్నం: మతి స్థిమితం లేని వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన కొత్తపట్నం మండలం అల్లూరు సమీపంలో చెరువుకట్టపై గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామం ఆర్ఆర్ కాలనీకి చెందిన పాట్లూరి వెంకటేశ్వర్లు(47) చెరువులో వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. గత పదేళ్ల నుంచి మతి స్థిమితం సరిగా లేకపోవడం వల్ల పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బంధువులు, స్థానికులు రక్షించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం అల్లూరు సమీపంలోని తాళ్ల వినాయక చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వేముల సుధాకర్ బాబు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి కుమార్తె మల్లవరపు సుబ్బులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటార్ సైకిళ్ల ఢీ

● ఒకరు మృతి, మరొకరికి గాయాలు

కావలి (జలదంకి): ముందు వెళుతున్న మోటార్ సైకిల్‌ను వెనుకగా మరో మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ముసునూరు బ్లూమూన్ దాబా వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు..ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని గోపాల్‌నగర్‌కు చెందిన సాయిసూర్య( ) లిక్కర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం బుచ్చిరెడ్డిపాళెం మండలం యల్లాయపాళెంలో జరిగిన బంధువుల కర్మక్రియకు హాజరయ్యాడు. అనంతరం మోటార్‌సైకిల్‌పై సింగరాయకొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో ముసునూరు బ్లూమూన్ దాబా సమీపంలోకి రాగానే గౌరవరానికి చెందిన ఉప్పు నాగరాజు గౌరవరం నుంచి కావలికి మోటార్‌సైకిల్‌పై వస్తూ వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయిసూర్య అక్కడికక్కడే మృతి చెందగా, నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా సాయిసూర్యకు భార్య కావ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగరాయకొండ మండలం కనుమళ్లలో హైవే పక్కన రూ.కోటికి పైగా విలువైన భూమి

● రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై గుట్టుగా కొట్టేసేందుకు టీడీపీ నేతల స్కెచ్
● 77 సెంట్ల చెరువు పోరంబోకు స్థలాన్ని జేసీబీతో చదును చేసిన ప్రైవేట్ వ్యక్తులు
● తొలుత ఆ స్థలం అసైన్‌మెంట్ పట్టా అని బుకాయించిన రెవెన్యూ సిబ్బంది
● స్థానికులు ప్రశ్నించడంతో చేసేదేమీ లేక అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు



ప్రభుత్వ స్థలాన్ని ఇటీవల జేసీబీతో చదును చేస్తున్న అక్రమార్కులు

బెడిసికొట్టిన భూకబ్జా ప్లాన్



హైవే పక్కన చిన్న కనుమళ్ల సర్వే నం.70లో విలువైన ప్రభుత్వ భూమి



రెవెన్యూ అధికారులు గురువారం ఏర్పాటు చేసిన బోర్డు

సింగరాయకొండ:

జాతీయ రహదారి పక్కనే సుమారు కోటిన్నర రూపాయల విలువ గల ప్రభుత్వ స్థలాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించేందుకు టీడీపీ నేతలు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. ఆక్రమణదారులకు ఆది నుంచే సంపూర్ణ సహకారం అందించిన రెవెన్యూ అధికారులు.. స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్లేటు ఫిరాయించి అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు. అందిన సమాచారం మేరకు ఈ భూ కబ్జా బాగోతం వివరాలిలా ఉన్నాయి.

సింగరాయకొండ మండలంలోని కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల ఎస్సీ కాలనీ సమీపంలో ఊళ్లపాలెం–వేములపాడు జాతీయ రహదారి పక్కనే సర్వే నంబర్ 70లో సుమారు 0.77 ఎకరాలు చెరువు పోరంబోకు స్థలం ఉంది. ఇది కనుమళ్ల చెరువుకు వర్షం నీరు ప్రవహించే ఒరవ. గత ఆదివారం ఈ స్థలాన్ని టీడీపీ సానుభూతిపరుడు, మండల రెవెన్యూ కార్యాలయంలో చక్రం తిప్పే ప్రైవేట్ వ్యక్తితోపాటు మరికొందరు కలిసి జేసీబీతో చదును చేశారు. స్థలంలో తొలగించిన చిల్లచెట్లు, తాటిచెట్లను తగలబెట్టారు. దీంతో చినకనుమళ్ల గ్రామస్తులు కొందరు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని వీఆర్వో విజయ దృష్టికి తీసుకెళ్లారు. ఆ స్థలాన్ని గతంలో కంకణాల ఆనంద్ అనే వ్యక్తికి అసైన్‌మెంట్ కింద పట్టా ఇచ్చినట్లు రికార్డు ఉందని, అతని వారసులు బాగు చేసుకుంటున్నారని వీఆర్వో సమాధానం ఇవ్వడంతో కనుమళ్ల వాసులు అవాక్కయ్యారు. 'అది చెరువు పోరంబోకు స్థలం. ఒకవేళ ఆనంద్‌కు పట్టా ఇస్తే అతను చాలా కాలం క్రితమే చనిపోయారు. అతనికి వారసులు ఎవరూ లేరు. స్థలాన్ని బాగు చేస్తోంది ఆనంద్ మరదలు తాలూకు వ్యక్తులు. వారు ఆనంద్‌కు వారసులు ఎలా అవుతార'ని స్థానికులు నిలదీశారు.

వీఆర్వో తీరుపై అనుమానాలు

కనుమళ్ల రెవెన్యూ సర్వే నంబర్ 70లో సెంటు స్థలం సుమారు రూ.2 లక్షలు ఉంది. దీంతో ఈ స్థలంపై కన్నేసిన టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రంగంలోకి దిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువు పోరంబోకు స్థలంలో అసైన్‌మెంట్ పట్టా ఇచ్చారని వీఆర్ఓ చెప్పడం స్థానికంగా చర్చనీయాంశం కావడంతో ఆక్రమణదారులతోపాటు రెవెన్యూ అధికారులు సైతం వెనకడుగు వేయక తప్పలేదు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ తానికొండ ప్రసాద్‌ను వివరణ కోరగా.. సర్వే నంబర్ 70లో ఉన్నది ప్రభుత్వ భూమి. అందులో ఎవరికి పట్టా ఇవ్వలేదు. గురువారం ఒక వ్యక్తి రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఎన్నో ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నాం, హక్కు కల్పించాలని కోరాడు. పట్టా లేదని చెప్పడంతో హక్కు కల్పించడానికి వీలుపడదని తెలియజేశామ'ని వివరించారు.



రూ.25 లక్షల విలువైన కరెన్సీ నోట్ల అలంకరణలో గణనాథుడు

గణాధిపతి@ధనపతి

ఒంగోలు మెట్రో: గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఒంగోలు నగరంలోని గద్దలగుంట రాజాపానగల్ రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని విగ్రహాన్ని గురువారం కరెన్సీ నోట్లతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీహరి పారాయణం బృందం ఆధ్వర్యంలో రూ.25 లక్షల విలువైన కరెన్సీ నోట్లను అలంకరణకు వినియోగించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈదుపల్లి దశరథరామారావు, రేణుకా దేవి దంపతులు, సభ్యులు ఓగిరాల సాయి చైతన్య, చెంగలశెట్టి చరణ్, చీదెళ్ల లక్ష్మణ, శివ, సాయినాథ్, సుబ్బారావు, శంకర్, రాజేష్, రఘు సాయి పర్యవేక్షించారు.

ఇద్దరు బాలికలపై మృగాడి లైంగిక దాడి

నిందితుడిపై పోక్సో కేసు నమోదు



కొత్తపట్నం: అభంశుభం తెలియని ఇద్దరు బాలికలపై పెదనాన్న వరుసయ్యే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బాలికలను బెదిరించడంతో మిన్నకుండిపోయారు. పాఠశాలలో ఉపాధ్యాయుల ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కొత్తపట్నం పోలీసులను ఆశ్రయించగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అందిన సమాచారం మేరకు.. కొత్తపట్నం మండలంలో ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికలు ఇద్దరిపై అదే గ్రామానికి చెందిన దొడ్ల వీరారెడ్డి ఈ నెల 7వ తేదీ ఆదివారం లైంగికదాడికి పాల్పడ్డాడు. వీరారెడ్డి తన ఇంటి ఎదురుగా ఆడుకుంటున్న ఇద్దరు బాలికలకు మాయమాటలు చెప్పి ఒకరి తర్వాత ఒకరిపై అత్యాచారం చేసినట్లు సమాచారం. తీవ్ర రక్తస్రావమైన బాలికలను వీరారెడ్డి చంపేస్తానని బెదిరించడంతో తల్లిదండ్రులకు చెప్పేందుకు కూడా సాహసించలేదు. పాఠశాలలో నీరసంగా ఉన్న బాలికలను ఉపాధ్యాయులు గుర్తించి ఆరా తీయడంతో విషయం బయటపడింది. టీచర్ల ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కొత్తపట్నం పోలీసులను ఆశ్రయించగా ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు బాలికలను వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్సై వేముల సుధాకర్‌బాబు తెలిపారు. కాగా నిందితుడు దొడ్ల వీరారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అట్టహాసంగా 'కళా ఉత్సవ్-25'



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ/చీమకుర్తి రూరల్: సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్ కాలేజీ)లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కళా ఉత్సవ్-2025 పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 6 కళలకు సంబంధించి 12 విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఒంగోలు, పర్చూరు డివిజన్లలోని 39 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి 311 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు మాట్లాడుతూ.. కళా ఉత్సవ్‌కు విశేష స్పందన లభించిందని, పోటీలకు భారీగా విద్యార్థులు హాజరవడం డైట్ చరిత్రలోనే ఇదే ప్రథమని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కళా సృజనను వెలికితీసేందుకు, విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహిస్తున్న పోటీల్లో కందుకూరు, మార్కాపురం డివిజన్ల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులను పోటీలకు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, న్యాయ నిర్ణేతలు, ఉమ్మడి జిల్లాలోని రెండు డివిజన్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్ల మధ్య 'చిత్ర'మైన గొడవ!

● మాటామాటా పెరగడంతో ఉపాధ్యాయుడి చెంప ఛెళ్లుమనిపించిన ఉపాధ్యాయురాలు
● ఉపాధ్యాయులను విచారించిన ఎంఈఓ-2.. డీఈఓ ద్వారా కలెక్టర్‌కు నివేదిక

సింగరాయకొండ: విద్యార్థులతో కలిసి ఫొటో దిగే విషయంలో టీచర్ల మధ్య తలెత్తిన వివాదం దాడికి దారితీసింది. ఆవేశానికి గురైన ఉపాధ్యాయురాలు తోటి ఉపాధ్యాయుడి చెంప ఛెళ్లుమనిపించారు. ఈ సంఘటన గురువారం సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామ పంచాయతీ చెల్లెమ్మగారి పట్టపుపాలెం ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాఠశాలలో సీహెచ్ విజయలక్ష్మి, సింగోతు జాలయ్య ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఆ గ్రామానికి చెందిన ఆశా వర్కర్ 5వ తరగతి విద్యార్థుల కోసం రెండు కోటు డ్రస్సులు ఇచ్చి ఫొటో దిగాలని ఉపాధ్యాయుడు జాలయ్యను కోరారు. ×హెచ్‌ఎం ఉన్నప్పుడు నేనెలా ఫొటో దిగుతా. ఆమెనే అడగండి₹ అని ఆశావర్కర్‌కు చెప్పారు. హెచ్‌ఎం వద్దకు వెళ్లి ఆశా వర్కర్ విజ్ఞప్తి చేయగా 5వ తరగతి విద్యార్థుల పర్యవేక్షణ చూసేది జాలయ్య కాబట్టి అతనితోనే ఫొటో దిగాలని స్పష్టం చేశారు. అదే విషయాన్ని జాలయ్యకు చెప్పే క్రమంలో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. హెచ్‌ఎం విజయలక్ష్మి ఆవేశానికి లోనై జాలయ్య చెంప పగలగొట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎంను మందలించి, ఎంఈఓ-1 శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో డీఈఓ కార్యాలయంలో ఉన్న ఎంఈఓ-1 విషయాన్ని డీఈఓకు తెలియజేశారు. డీఈఓ ఆదేశాలతో ఎంఇఓ-2 ఆవుల శ్రీనివాసులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతోపాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్, కుకింగ్ ఏజెంట్లు, గ్రామస్తులను విచారించారు. ఆ నివేదికను డీఈఓ ద్వారా కలెక్టర్‌కు అందజేసినట్లు ఎంఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● ఫారెస్ట్ డీడీ సందీప్ కృపాకర్




అమరులకు నివాళులర్పిస్తున్న డీడీ సందీప్ కృపాకర్, అటవీశాఖ సిబ్బంది

మార్కాపురం: అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.సందీప్ కృపాకర్ పేర్కొన్నారు. గురువారం అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక అటవీశాఖ కార్యాలయంలో అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ డీడీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ స్మగ్లర్ల చేతిలో అటవీ సిబ్బంది చనిపోయారన్నారు. ప్రాణత్యాగం చేసిన వారి సేవలను ఆదర్శంగా తీసుకుని సిబ్బంది పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ప్రజా చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

● ఈ నెల 28న జిల్లాలో గిరిజన సంఘాల సదస్సు
● గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ వెల్లడి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వడిత్యా శంకర్‌నాయక్

ఒంగోలు వన్‌టౌన్: గిరిజన ప్రజా చైతన్య యాత్ర గోడ పత్రికను రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ గురువారం ఆవిష్కరించారు. ఒంగోలులోని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీన జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చైతన్య యాత్ర ఇప్పటికే మూడు జిల్లాల్లో పూర్తయిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా గిరిజనుల బతుకులు ఏ మాత్రం మారలేదన్నారు. గిరిజనుల హక్కులను కాపాడుకునేందుకు ఏక తాటిపై కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఆర్.సైదా నాయక్, పి.సత్యం, ఆర్.హనుమానాయక్, ఎ.కోటి నాయక్, హరినాయక్, ఎ.శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి 20 మందికి గాయాలు

కురిచేడు: మండలంలోని ఆవులమంద గ్రామం నుంచి 30 మందితో త్రిపురాంతకం మండలం ఇసుక త్రిపురాంతకం గ్రామానికి వెళుతున్న టాటా ఏస్ వాహనం మండలంలోని పాత నాంచారపురం గ్రామం వద్ద తిరగబడింది. ఈ ఘటనలో 18 మందికి స్వల్పగాయాలు కాగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో పల్లె సామ్రాజ్యానికి తలకు బలమైన గాయం కాగా, పల్లె అంకమ్మకు చేయి నుజ్జునుజ్జయింది. వారిని స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి అనంతరం 108 వాహనాల్లో వినుకొండకు మెరుగైన వైద్యం కోసం తరలించారు.



తలకు గాయమైన సామ్రాజ్యం



చేయి నుజ్జునుజ్జయిన అంకమ్మ